# ట్రాన్స్‌ఫర్లొస్తున్నాయి జాగ్రత్త!

పరిమళా సోమేశ్వర్

ఆ రోజు మంగళవారం.

సైన్సు అసిస్టెంటు సూర్యప్రకాశ్ స్కూలులోకి అడుగు పెడుతూనే వాతావరణంలో ఏదో "మార్పు" జరిగినట్టు పసి కట్టాడు. మర్నాడు పెళ్ళి జరగబోతున్న మధ్య తరగతి గృహస్థు ఇల్లులా, పెద్దింటి పరంధామయ్య చనిపోయిన తరువాతవదో రోజున బంధువులతో నిండిన మేడలా, పరీక్షల్లో కాపీ కొట్టనీయనందుకుగాను లెక్కల పేపరునాడు స్టూడెంట్సు పరీక్షలను బాయ్‌కాట్ చేసి వినాదాలు చేస్తున్న సమితి ప్రెసిడెంటుగారి ఊళ్ళోని స్కూలులా సందడిగా ఉంది స్టాఫ్‌రూము.

రోజూ స్కూలుకి వస్తూనే రెండు కాళ్ళూ బారజాపి ఐదు నిమిషాల్లో గురక పెడుతూ గాఢనిద్రలో మునిగిపోయే హిందీ మాష్టారు హరినారాయణ్‌సిన్హా కూడా ఆ రోజు ఎంతో 'యాక్టివ్'గా నలుగురితోనూ కబుర్లు చెప్తూ కనిపించేడు.

ఫస్టు పీరియడ్ అయితే తప్ప ఎన్నడూ భార్య బయటున్నదని, రెండో కూతురు పెద్దమనిషయిందని, చంటాడికి జ్వరమనీ, తండ్రి తద్దినమనీ, మామగారికి గుండె జబ్బనీ ఇలా ఏదో ఒక వంక మీద నెలలో ఇరవై రోజులు ఏదో ఒక లీవు మీద వుండే తెలుగు పండిట్ లక్ష్మణశాస్త్రి తెల్లని పంచ, తెల్లని లాల్చీ వేసుకుని ముఖాన అగరు బొట్టు పెట్టుకుని ఆ రోజు అంత త్వరగా స్కూలుకి ఎలా వచ్చేడా అని ఆశ్చర్యపోయేడు సూర్యప్రకాశ్.

స్కూలుకి వచ్చిన దగ్గర నుండి అప సోపాలుపడుతూ ఇంట్లో తనని అత్త, ఆడబడుచులు కలిసి ఎలా రాచి రంపాన పెట్టున్నారో రసవత్తరంగా ఎన్నటికీ పూర్తి కాని తెలుగు రచయిత్రి సీరియల్ నవలలా చిలవలు పలవలు చేసి వర్ణించి చెప్పే సోషల్ స్టడీస్ టీచర్ సుందరమ్మ నోరు ఆ రోజు మూతబడి ఉండటం కూడా గ్రహించేడు సూర్యప్రకాశ్.

"పదిహేడు రోజులుందా? ఐతే సీదాకా రాకపోవచ్చు" అన్నాడు వెంకటరెడ్డి.

"ఎందుకు రాదండీ? ఆర్డర్లు మనచేతికి వచ్చేసరికి పదిహేడు రోజులు దాటుతాయ్ ఎలాగో. అందువల్ల ఇతనికి తప్పకుండా వస్తుంది" అన్నాడు చంద్రయ్యగుప్తా వికటచ్చిగా.

"ఏమిటి వచ్చేది.... నాకు?" అనడిగేడు అయోమయంగా సూర్యప్రకాశ్.

"ట్రాన్స్‌ఫరండీ? మీ కింతవరకు తెలియదా? ఇవ్వాళ పేపరు చూడలేదా మీరు?" అనడిగేడు గుప్తా.

"చూడలేదండీ ఈ రోజు లేవటమే ఆలస్యంగా లేచేను. లేవగానే స్నానం అదీ చేసి, భోజనం చేసి ఇలా బయల్దేరి వచ్చేను." అన్నాడు సూర్యప్రకాశ్. అతనన్న దాంట్లో కొంత నిజం. కొంత అబద్ధం ఉన్నాయ్.

పేపరారోజు అతను చూడలేదనటం నిజం. కాని చూడకపోవటానికి కారణం-

స్కూలుకి రాని చౌదరి ఆ రోజు మామూలు టైముకన్న ఐదు నిముషాలు ముందే వచ్చేడు. సమితి ప్రెసిడెంట్ బావమరిదికి తోడల్లుడవటం వల్ల చౌదరిని హెడ్‌మాస్టర్లు ఏమీ అనలేరు. అతను స్కూలుకి వచ్చి పాఠాలు చెప్తే అంతే చాలునని వినయపూర్వకంగా విన్నవించుకునేవారు.

కాని చౌదరికి, స్కూల్లో పాఠాలు చెప్పటం కన్న బయట సెంటర్లో నిల్చుని పాలిటిక్సు మాట్లాడట మంటేనే ఇష్టం. అతని ఇష్టా నిష్టాలను వ్యతిరేకించే ధైర్యం ఏ హెడ్ మాస్టరుకీ లేదు. ఒక కుర్ర హెడ్ మాస్టారు వ్యతిరేకించినందుకుగాను ఆ స్కూలుకి వచ్చిన మూడోరోజునే పెట్టే బేడా పట్టుకుని ట్రాన్స్‌ఫర్ మీద ఒక అడివి ప్రాంతంలోని హైస్కూలుకి వెళ్ళవలసి వచ్చింది.

"ఏమిటివాళ, అంతా కొత్తగాఉంది? ఎవ్వరూ తమ సహజ ధోరణిలో లేరే" అని లోలోపలే అనుకుంటూ అటెండెన్సు రిజిస్టరులో సంతకంచేసి వచ్చిన సూర్యప్రకాశ్‌ని చూసి "ఏమోయ్. నువ్వీ స్కూల్లో చేరి ఎన్నాళ్ళయిందేమిటి?" అనడిగేడు వెంకటరెడ్డి.

"సుమారు మూడేళ్ళయిందనుకుంటాను" అన్నాడు సూర్యప్రకాశ్ అసలు విషయమేమిటో తెలియక.

"సుమారు-గిమారు అంటే కుదరదోయ్. ఖచ్చితంగా చెప్పు. మూడు సంవత్సరాలు నిండినాయా లేదా?" లెక్కల టీచరు రామకృష్ణ గట్టిగా అడిగేడు.

కాస్త ఆలోచించి "మూడు సంవత్సరాలు నిండటానికి ఇంకా పదిహేడు రోజుల టైముందండీ" అన్నాడు సూర్యప్రకాశ్.

అతనింట్లో పేపరు తెప్పించకపోవటమే గాని.... టైములేక కాదు.

"పేపర్లో ఏముందండీ?" అనడిగాడు సూర్య ప్రకాశ్ కుతూహలంగా.

"అన్ని స్కూళ్ళలోనూ పదో క్లాసు ఫలితాలు చాలా 'పూర్'గా ఉన్నాయి కనుక మూడు సంవత్సరాల సర్వీసున్న టీచర్లనీ, హెడ్‌మాస్టర్లనీ అందరినీ ట్రాన్స్‌ఫర్ చెయ్యమని ప్రభుత్వంవారి ఆదేశం. ఆ ఆదేశం ప్రకారం ఈ నెలాఖరులోగా అందరికీ ట్రాన్స్‌ఫరొస్తా యనుకుంటున్నారు" అని చెప్పేడు రామకృష్ణ.

అతనా స్కూలుకి వచ్చి ఇంకా మూడు సంవత్సరాలు కాలేదు. అందువల్ల అతను నిశ్చింతగా వున్నాడు ఆ వార్తవిని, ఆ సంగతి గ్రహించిన గుప్తాకి మండిపోయింది.

"మూడు సంవత్సరాలు నిండక

పోయినా అసమర్థులయిన టీచర్లను కూడా ట్రాన్స్‌ఫర్ చెయ్యదల్చుకున్నారుట" అన్నాడు గుప్తా.

రామకృష్ణ చెప్పే లెక్కలు ఏ మాత్రం బుర్రకెక్కటంలేదని అమధ్య స్టూడెంట్సందరూ కలసి హెడ్‌మాస్టరుగారికి, సమితి ప్రెసిడెంటుగారికి, ఎమ్మెల్యేగారికి మెమొరాండం సమర్పించేరు.

దానికి రామకృష్ణ "అసలు లెక్కలు సబ్జక్టే అంతేనండీ ఎంతో తెలివి, శ్రద్ధ ఉంటేతప్ప అవి బుర్ర కెక్కవు. ఒకటో క్లాసు నుండి తొమ్మిదో కానువరకు కాపీ కొట్టి పాస్యయిన విద్యార్థులకు ఒక్కసారే అన్నీ బోధించి పదో కానులో పబ్లిక్ పరీక్షకు పంపించాలంటే మాటలా? చెప్పే వాళ్ళకి తెలుస్తయ్ అందులోని సాధక బాధకాలు.." అంటూ తన గోడు వెళ్ళబెట్టుకున్నాడు రామకృష్ణ. రామకృష్ణ మీద ఏమి చర్య తీసుకోకుండా "సరే. ఎలాగైనా లెక్కల్లో అందరూ పాస్యయ్యేటట్లు చూడండి" అని దయదలచి వదిలిపెట్టేరు అధికారులు.

ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే గుప్తా ఇప్పుడిలా అంటున్నాడని అర్థమయింది రామకృష్ణకి.

"అసమర్థులయిన టీచర్లనే కాదండీ, స్కూల్లో పాఠాలు చెప్పటం ఒక సైడు వృత్తిగా కావిసూ పెద్ద పెద్ద వ్యాపారాలు చేసూ ఊళ్ళో స్థిరపడిపోయిన టీచర్లను కూడా ట్రాన్స్‌ఫర్ చేస్తారుట" అన్నాడు కసిగా.

దాంతో రెండు క్లాత్ స్టోర్సునీ ఒక

నాగపూర్ కాంగ్రెసు అధ్యక్ష పదవి అలంకరించిన ఆనందాచార్యులుగారొకపర్యాయం, మద్రాసు హైకోర్టులో ముత్తుస్వామి అయ్యరు ఎదుట వాదిస్తూ, "కులుకూభట్టు ఏమన్నాడంటే" అంటూ చెపుతూండగా ముత్తుస్వామి అయ్యరు అడ్డువచ్చి "కులుకుభట్టు ఏమన్నదీ, ఆనందభట్టు చెప్పినది నాకు వినాలని లేదు. అసలు విషయం గురించి మాట్లాడండి" అన్నాడు. అప్పు డానందాచార్యులు "ఈ విషయంలో ముత్తుభట్టు అభిప్రాయం లెక్కచెయ్యాలని నాకూ లేదు" అని ఫెడేలుమని జవాబిచ్చి కూర్చున్నాడు.

హోల్‌సేల్ కిరాణా దుకాణాన్ని అన్నదమ్ముల పేరుమీద నడుపుతున్న గుప్తా గుండె గుభేలుమంది.

పైకి మాత్రం పళ్ళన్నీ బయటపెట్టి నవ్వేస్తూ "వ్యాపారం దేముందండీ? ఈ ఊళ్ళో కాకపోతే ఇంకో ఊళ్ళో నడిపించవచ్చు వందల ఎకరాల కొద్దీ భూమీ పుట్రా ఉన్న రైతులు భయపడాలి వాళ్ళు

ఊళ్ళో లేకపోతే. దగ్గరుండి పొలం వ్యవహారాలు చూసుకోపోతే - పంటలెలా ఇంటికి వస్తాయి?" అన్నాడు వెంకటరెడ్డి వంక ఓరగా చూస్తూ.

వెంకటరెడ్డి జమీందారీ వంశానికి చెందినవాడు. అతనికి ఎన్నెకరాల పొలం ఉందో అతనికే తెలియదు. ఆరుగురు కొడుకుల్లో ఆఖరు వాడవటం వల్ల అల్లారు ముద్దుగా పెరిగేడు. బీయస్సీ ఆరుసార్లు తప్పి ఏడోసారి అత్తెసరు మార్కులతో పాసై ఇంట్లో కూర్చుంటే తోచటంలేదనీ ఎమ్మెస్సీలో సీటు దొరకాలంటే 'ఎంట్రెన్సు టెస్టు'కి కూర్చోవలసి వస్తుందని భయపడీ చివరికి బి. యిడి. చేసి ఎమ్మెల్యేగారిరికమెండేషన్‌తో ఉద్యోగం సంపాదించుకుని స్కూల్లో చేరేడు.


పుట్టి పెరిగిన ఊరు వదలివెళితే 'స్థానబలం' వుండదనీ. పరాయి వూళ్ళో తన 'ప్రత్యేకత'ను ఎవరూ గుర్తించరని అతనికి తెలుసు. అందువల్ల గుప్తా మాటలకి వళ్ళు మండింది వెంకటరెడ్డికి.


ఎలా సమాధానం చెప్పాలో తెలియక సతమతమవుతున్న సమయంలో అటుగా వచ్చిన లక్ష్మణశాస్త్రిని చూసి "భూములు వ్యాపారాలు ఉన్న వాళ్ళ సంగతటుంచండి. అడపాదడపా లీవులు పెట్టే ఇర్రెగ్యులర్ టీచర్లను కూడా ట్రాన్స్‌ఫరు చేస్తారుట...." అన్నాడు వెంకటరెడ్డి వెటకారంగా.

దానికి లక్ష్మణశాస్త్రి ఏ మాత్రం చలించలేదు. తాపీగా ఓ పట్టు నస్యం పీల్చి అన్నాడు."రోజూ వచ్చి స్కూల్లో అటెండెన్సు రిజిష్టరులో సంతకం చేసి క్లాసులో సలభై అయిదు నిమిషాలూ కూర్చున్నంతమాత్రాన సరిపోదోయ్ వారానికి ఒక్కక్లాసు తీసుకున్నా చెప్పేదేదో క్షుణ్ణంగా పిల్లగాళ్ళ తలకెక్కేలా చెప్పేవాడే ఆదర్శోపాధ్యాయుడు. తెలిసిందా?"

"మీ మగాళ్ళను ట్రాన్స్‌ఫర్ చేస్తే చక్కగా ఎలాగోలా బస్సులోనో, రైలులోనో, కాలినడకనో వెళ్ళి వేరే స్కూల్లో జాయిన్ అవుతారు. తరువాత నెమ్మదిగా ఇల్లూ, వాకిలీ చూసుకుని భార్యా బిడ్డలను తీసుకు వెళ్ళవచ్చు.

మా ఆడవాళ్ళ సంగతేమిటి చెప్పండి? ముక్కూ మొహం తెలియని ఊళ్ళో ఎక్కడని ఉండటం? నానా అవస్థలూపడి మా





ఇద్దరు పిల్లల్ని నెల రోజుల క్రితమే కాన్వెంటులో చేర్పించేను. మావార్ని ఈ ఊరు ట్రాన్స్ఫర్ చేయించటానికి రెండు సంవత్సరాలు పట్టింది. తీరా ఆయన ఈ ఊరు వచ్చేసరికి నాకు మూడేళ్ళయిందని ట్రాన్స్ఫర్ చేస్తే మా కుటుంబం గతి ఏం కాను? అసలే మా అత్తగారికి నేను ఉద్యోగం చెయ్యటం ఇష్టం లేదు. వేరే ఊరు ట్రాన్స్ఫరయిందని తెలిస్తే ఉద్యోగం మానేసి యింట్లో కూర్చో మంటారు. అత్తపోరు. ఆడబడుచుల పోరు రోజులో ఆరుగంటల సేపైనా తప్పించు కోవచ్చు కదా అని ఉద్యోగం చేస్తున్నాను. ఇక ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లో ఉన్నానంటే నా ప్రాణం తోడేస్తారు. భగవంతుడా! ఈ ట్రాన్స్ఫర్లు నా ఖర్మ కొద్దీ నే వచ్చినట్లున్నయ్" అంటూ ఏకధాటిన తన బాధ వెళ్ళగ్రక్కింది సుందరమ్మ.

"మీకేమండి ఆడవాళ్ళ పనే బాగుంది ఈ రోజుల్లో. మహిళా దశాబ్దంగదా ఇది. మీ మహిళామండలి తరపున ఆడ ఎమ్మెల్యేకు మీ బాధను చెప్పుకోండి. తప్పకుండా మీ మాట వింటారు" అన్నాడు చౌదరి.

"ఎమ్మెల్యేలుగాని పంచాయితీబోర్డు ప్రెసిడెంటుగాని ఏరాజకీయనాయకులూ ఈ ట్రాన్స్ఫర్ల విషయంలో జోక్యం కలగజేసుకోకూడదని ప్రభుత్వం వారు ముందే హెచ్చరించేరట గదండీ" అన్నది సుందరమ్మ. ఇలా రాబోయే ట్రాన్స్ఫర్లను గురించి అందరూ ఆదుర్దా పడుతున్నారు. ప్రతి ఒక్కరికీ ఏ కారణం చేతనైనా తమకి ట్రాన్సుఫర్ రావచ్చునన్న బాధ ఓ పక్క. ఏకారణం చేతనైనా ఇతరులు ట్రాన్సుఫరునుండి తప్పించుకుంటారేమోనన్న ఈర్ష్య.... రెండూ బాధించసాగినయ్.

ఆ వార్తవిన్న దగ్గరనుండి ఎవ్వరికీ మనసులో మనసులేదు. పాఠాలు చెప్పాలన్న ఆసక్తే వుండటంలేదు. తిండిమీద డ్రెస్సుమీద, సినిమాలమీద, 'గాసిప్' మీద దేనిమీదా శ్రద్ధ ఉండటం లేదు.

ఆఖరికి రోజూ స్టాఫ్రూములో జరిగే నిత్య కార్యక్రమంలోని ఒక భాగమైన హెడ్మాస్టారుగారి "నిరంకుశ చర్యల"ను గురించిన చర్చలు కూడా "బంద"యిపోయినయ్.

ఎవరికివారు తమ నీడను చూసి తామే ఉలికి పడ్డట్టు జంకుతున్నారు.

అంతవరకూ అందరిలోనూ గుప్తంగా ఉన్న వ్యక్తిగతమైన ఈర్ష్యా ద్వేషాలు-కక్షలు అగ్నిపర్వతం బ్రద్దలవగానే పొంగిపొరలే లావాలా పైకి ప్రవహించసాగినయ్.

"వీడీ స్కూల్లో పదేళ్ళ నుండి తిష్ఠ వేసుకొని ఉన్నాడు. వీడికి ట్రాన్స్ఫర్ కావలసిందే" అనీ,

"వీడు వచ్చి రెండేళ్ళే అయిన మాట నిజమేగాని ఈ రెండేళ్ళలో రెండ్రోజులన్నా పాఠం సరిగా చెప్పేడా? ప్రైవేట్లు చెప్పి అప్పుడే పదివేలు బాంకులో వేసు


# 1950 నుంచి......

## జాతి సేవలో నిమగ్నమైన సంస్థ

తాజా పరికరాలతో, ఆధునిక సౌకర్య సమన్వితమైన తమ ఫ్యాక్టరీలో సిరీస్ సంస్థ వారు యాంటీ బయాటిక్స్, విటమిన్స్, హిమటినిక్స్, ప్రొటీన్ పదార్థాలను, యాంటి-టి. బి., దగ్గు, ఉబ్బసం నివారణ ఔషధాలను, కీళ్ళ నొప్పులు ఎనాల్జెసిక్ ఔషధాలను తయారుచేస్తున్నారు.

ఉన్నతమైన అర్హతలుగల కెమిస్టులు పరిశోధన, అభివృద్ధి, నిర్మాణ కార్యక్రమాలలో నిమగ్నులై వున్నారు.


ముడి పదార్థాలు, తయారైన వస్తువులు తీవ్రమైన పరీక్షకు లోనైన తర్వాతనే మార్కెట్టులోకి వస్తాయి.

సిరీస్ ఉత్పత్తి అయిన ప్రతి ఔషధంపైన క్వాలిటీ మార్కు వుంటుంది. సామాన్యునికి సులభంగా అందుబాటులో ఉంటుంది.

ఆరోగ్యదాయకమైన ఔషధాల ద్వారా సిరీస్ జాతికి సేవ చేస్తున్నది.

సౌత్ ఇండియా రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ప్రయివేట్ లిమిటెడ్,

సిరినగర్ : : విజయవాడ-7.




కున్నాడు. వీడికి ట్రాన్స్‌ఫర్ వస్తే తప్ప తిక్క కుదరదు" అనీ,

"అసలే ఆ హెడ్ మాష్టారుకి నేనంటే గిట్టదు. సినిమాహాల్లో "బ్లో హాట్ బ్లో కోల్డ్" రెండో ఆటకి ప్రైమరీ స్కూలు టీచరు పుష్పావతిని వెంటబెట్టుకని వెళ్ళిన రోజున వాళ్ళిద్దరినీ ఇంటర్వెల్లో తను చూసేనని గ్రహించేడు. అందరి ముందూ తనగుట్టు ఎక్కడ బైటపెడతానోనని నామీద కక్షకట్టి వాడానికొక "మెమో"ను ఏదో ఒక వంకమీద పంపిస్తున్నాడు, ఆ కసి మనసులో వుంచుకుని నాకు ట్రాన్స్ఫరు వచ్చేట్లు చేస్తాడో ఏమో. ఇలా ఎవరికివారు తమని గురించి భయపడుతూ ఇతరుల గురించి అసూయపడుతూ నిద్రాహారాలకు, మనశ్శాంతికీ దూరమైపోయేరు

సూర్యప్రకాశ్‌కి రెండేళ్ళ క్రితమే వివాహమయింది. ఆమె అదే ఊళ్ళో ఒక ఆఫీసులో క్లర్కుగా పనిచేస్తోంది.

"మీకు ట్రాన్స్‌ఫరయితే నా గతేం కానండీ? మా ఆఫీసుకు ఈ ఊళ్ళో తప్ప మరెక్కడా 'బ్రాంచి'లు లేవు గదా. నాకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటానికి వీల్లేదు గదా ఎలా చెప్పండి?" అంటూ ఆదుర్దా పడింది.

"పోన్లే అంతగా ట్రాన్స్‌ఫరు వచ్చినపుడు చూద్దాం. ఇప్పటి నుండే బెంబేలు పడకు. అంతగా ట్రాన్స్‌ఫర్ రావటమే జరిగితే నువ్వు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేద్దువుగాని" అని భార్యనోదార్చేడు సూర్యప్రకాశ్.

మేకపోతు గాంభీర్యంతో అన్నాడే గాని నిజానికి భార్యచేత రాజీనామా ఇప్పించటం ఏమాత్రం ఇష్టం లేదతనికి. నిజం చెప్పాలంటే ఆమె ఉద్యోగం, సంపాదనా చూసే పిల్ల నచ్చిందని కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు సూర్యప్రకాశ్. తనూ భార్యా ఇద్దరూ సంపాదిస్తూండబట్టే తన చదువుల కోసం చేసిన అప్పును నెలనెలా తీర్చటం, తమ్ముడిని చదివించటం, చెల్లెలి పెళ్ళికి బ్యాంకులో నెలనెలా డబ్బు జమకట్టటం చేయగల్గుతున్నాడు.

భార్య గనుక ఈ స్థితిలో ఉద్యోగం మానిందంటే తన ఇంటి బడ్జెటు కాస్తా తలక్రిందు లయిపోతుంది. ఆ భయాన్ని పైకి, భార్య ముందు వెల్లడి చెయ్యటం ఏమాత్రం ఇష్టంలేదు సగటు భారతీయ పురుషుడైన సూర్యప్రకాశ్‌కి.

కాని అనటం మాత్రం పైకి భార్య ఉద్యోగం మానినా ఏం పరవాలేదన్నట్లు ధీమాగా మాట్లాడేడు.

తరువాత భార్యని నవ్వించాలనే ఉద్దేశ్యంతో "మనిద్దరం ఒకచోట ఉన్నందున ఒరిగిందేమిటి లల్లీ? రోజూ మనిద్దరం గిల్లికజ్జాలు పెట్టుకుని పోట్లాడుకోవటమే గదా?" అన్నాడు హాస్యంగా.

"మీకు ట్రాన్స్‌ఫరై మీరెళ్ళిపోతే ఇకనుండి నేనెవరితో పోట్లాడనండీ?" అంటూ అతని గుండెమీద వాలి భోరున ఏడ్చింది అతని భార్య.

ఇలా అందరూ పరిపరి విధాల పరితపిస్తూ వారం రోజులు గడిపేరో లేదో ఓ ఉదయాన హెడ్‌మాష్టర్ గారికి ట్రాన్స్ఫరయినట్లు ఆర్డర్లు వచ్చినయ్.

మరో సమయంలో అయితే హెడ్ మాష్టరుగారికి ట్రాన్స్ఫరయినందుకు మహోత్సాహంతో వీడ్కోలు సభను ఏర్పాటు చేసి ఉపన్యాసాలలో మాత్రం హెడ్ మాష్టరుగారి కార్యదీక్షనీ నిజాయితీని మెచ్చుకునే వారే. కాని టీచర్లు కూడా ఎవరికివారూల్లో వారుంతటం వల్ల హెడ్ మాష్టరుగారి వీడ్కోలు సభను అంతగా 'ఎంజాయ్' చెయ్యలేకపోయేరు.

"చచ్చిపోయిన వాళ్ళకోసం చావబోయే వాళ్ళు ఏడవటం ఏమిటి?" అన్నట్లుగా "ట్రాన్స్‌ఫర్ అయినవాణ్ణి చూసి అవబోయేవాళ్ళు సంతోషించటమేమిటి?" అని ముభావంగా ఊరుకున్నారు.

ముందు హెడ్ మాష్టర్లందరిని ట్రాన్స్



ఫర్ చేసేరు. 'ఇక టీచర్ల లిను ఈనెలలో ఏ క్షణానైనా రావచ్చు"నని అందరూ ప్రాణాలు బిగబట్టి ఎదురు చూస్తున్నారు. ఆ ఆదుర్దాలో కొత్తగా వచ్చిన హెడ్ మాస్టరుని క్రిటికల్‌గా పరిశీలించి విమర్శించాలన్న ఆసక్తి ఎవ్వరికీ లేకుండా పోయింది.

కుర్చీలో కూర్చున్న హెడ్ మాస్టరు ఎలాటివాడైనా – ఏదో రకంగా అతనిని విమర్శించి, చెడు ప్రచారాలు చెయ్యటం, ఆయన ట్రాన్స్‌ఫరై వెళ్ళాక కొత్త హెడ్ మాస్టరిని కూడా క్రమంగా ద్వేషించటం ప్రారంభించి "పాత హెడ్ మాస్టరే నయం" అని చెప్పుకోవటం అతిసహజమైన టీచర్ల స్వభావం.

కాని ఎప్పటిలా ఈ సారి పాత, కొత్త హెడ్ మాస్టర్లను "కంపారిటివ్"గా 'స్టడీ' చేసే ఆసక్తి ఎవ్వరికీ లేకపోయింది.

ఇలా ఉండగా ఉన్నట్టుండి మరో వార్త పేపర్లలో పెద్ద అక్షరాలలో అచ్చయింది.

"గోదావరి ఆనకట్టకి గండి పడింది, ఈ గండిని పూడ్చటానికి ఐదారు లక్షల రూపాయలు ఖర్చవుతుంది." ఇదీ వార్త.

"అమ్మో గోదావరికి అంత పెద్ద గండా?" అంటూ ఆశ్చర్యపోయేరు అందరూ.

"ఔను. అమాయక ఉపాధ్యాయులను ట్రాన్స్‌ఫర్ల పేరుతో ఇలా మానసిక క్షోభకు గురిచేస్తే గోదావరికి గండిపడటమేమిటి? హిమాలయాలే కూలిపోతాయి. మన ఉసురు దేశానికి తగలకమానుతుందా?" అన్నారొకరు.

"దేశ సౌభాగ్యానికి వెన్నెముకలైన మనం అలా దేశానికి ఉసురు పెట్టేట్లు శపించటం మంచిది కాదండీ" అన్నారింకొకరు.

"మన ఉపాధ్యాయుల కడగండ్లు చూసి గోదావరీమతల్లి గుండె పగిలింది. అందుకే ఈ గండి పడింది" అన్నాడు తెలుగు పండిట్ లక్ష్మణశాస్త్రి.

ఏమయినా మరో వారం రోజులు ట్రాన్స్‌ఫర్లతోపాటు గోదావరి గండి కూడా పాఠశాలల్లోని ఉపాధ్యాయుల మధ్య చర్చనీయాంశం అయిపోయింది. తరువాత హఠాత్తుగా మరో వార్త వచ్చింది హెడ్ మాస్టరు ద్వారా.

గోదావరి గండిని పూడ్చడానికి చాలా డబ్బు ఖర్చు చేయవలసి వుంటుంది కనుక ఈ కరవు రోజుల్లో ఆ ఖర్చులతో పాటు ట్రాన్స్‌ఫర్లకయ్యే ఖర్చును కూడా ప్రభుత్వం భరించలేదనీ అందువల్ల ట్రాన్స్‌ఫర్లను ఈ సంవత్సరానికి తాత్కాలికంగా ఆపివేస్తున్నట్టు వార్త.

ఆ వార్త వింటూనే వాతావరణంలోని 'టెన్షన్' కాస్తా విడిపోయింది.

"అమ్మా! గోదావరి తల్లీ! నీ పుణ్యాన ఈ ఏటికి గండం గడిచింది తల్లీ. వచ్చే ఏటి సంగతి.... అప్పుడు చూసుకుందాం" అన్నాడు లక్ష్మణశాస్త్రి పైకే ప్రార్థిస్తూ. తమ మనసులోని మాటని ప్రతిధ్వనించిన లక్ష్మణశాస్త్రిని చూస్తూ తేలికగా నిట్టూర్చేరు మిగతా ఉపాధ్యాయులు.

★